సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం : 30 : జూన్ : 2023



టన్ను చీనీ రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.



ఉచితంగా 11 రకాల సేవలు

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగా 11 రకాల సేవలు అందించే కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 8లో

గరిష్టం/కనిష్టం
35.8°/22.1°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఎమ్మెల్యే కేతిరెడ్డి ఔదార్యం

- కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థికసాయం



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ముదిగుబ్బ: 'గుడ్‌మార్నింగ్ ధర్మవరం' పేరుతో నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలు పరిష్కరించే ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కార్యకర్తలనూ కుటుంబ సభ్యుల్లా చూసుకుంటున్నారు. ఆపదలో అన్నలా ఆదుకుంటున్నారు. బాధిత కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనిస్తున్నారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కె.రామచంద్ర ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి గురువారం ఉప్పలపాడుకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామచంద్ర భార్య మంజులకు సొంతంగా రూ.5 లక్షల ఆర్థికసాయం అందజేశారు. అలాగే రామచంద్ర కూతురు ఐశ్వర్య, కుమారులు లక్ష్మీకాంత్, విష్ణువర్ధన్‌కు ధైర్యం చెప్పారు. పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కష్టాల్లో ఉన్న ఏ కార్యకర్త అయిన తన ఇంటి తలుపు తడితే ఆదుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు బీపీ ఓబిరెడ్డి, నాయకులు నాగేంద్రరెడ్డి, నారాయణరెడ్డి, ద్వారకనాథ్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి



డీఎస్పీ, సీఐలతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

ధర్మవరం అర్బన్: శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ మాధవరెడ్డి సిబ్బందికి సూచించారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఎస్పీ మాధవరెడ్డి డివిజన్ పరిధిలోని సమస్యలపై డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం, టూటౌన్ సీఐ రాజాలతో చర్చించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులు ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. నిరంతరం వాహనాలను తనిఖీలు చేయాలని సూచించారు. డివిజన్ పరిధిలోని స్టేషన్ల పనితీరుపై ఆరా తీశారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, కదిరిగేటు తదితర ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు.

సాంకేతిక పురోగతితోనే దేశాభివృద్ధి

అనంతపురం: సాంకేతిక పురోగతితోనే దేశాభివృద్ధి సాధ్యమని ఏపీ సైన్స్ సిటీ సీఈఓ డాక్టర్ కే జయరామి రెడ్డి అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని మేథమేటిక్స్ విభాగంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు రెండో రోజైన గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మేథమేటిక్స్ సబ్జెక్టులో నూతన అంశాలపై అధ్యయనం చేయాలన్నారు. వినూత్న ఆవిష్కరణలపై పరిశోధన విద్యార్థులు దృష్టి కేంద్రీకరించాలని కోరారు. టెక్సాస్- యూఎస్‌ఏ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ఎం. మల్లికార్జునయ్య నాన్ లీనియర్ డార్సీ బ్రింక్‌మన్-ఫోర్క్ హైమర్ ఫ్లూయిడ్ ఫ్లో మోడల్ అనే అంశంపై ప్రసంగించారు. .

ఘనంగా బక్రీద్ వేడుకలు



చిన్నారుల ఆలింగనం..



హిందూపురంలోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పర్వదినాన్ని జిల్లాలో ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా ప్రాంతాల్లోని మసీదులు, ఈద్గా మైదానాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, ముతవల్లీలు బక్రీద్ విశిష్టతను వివరించారు. అనునిత్యం ప్రార్థనలు, దానాలు, త్యాగాలు చేయడం దైవకృపకు చేరువచేస్తాయని వెల్లడించారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. – సాక్షిబృందం:

భక్తిశ్రద్ధలతో ఏకాదశి



ధర్మవరం: అలంకరణలో లక్ష్మీచెన్నకేశవస్వామి



కదిరిటౌన్: భక్తులతో కిటకిటలాడుతున్న ఖాద్రీ ఆలయం

తొలి ఏకాదశి వేడుకలు జిల్లాలో ఘనంగా జరిగాయి. ముఖ్యంగా వైష్ణవ ఆలయాలు గురువారం ఉదయం నుంచే భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో ఉత్సవమూర్తులకు అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో స్వామివార్ల కల్యాణోత్సవాలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. కదిరి పట్టణంలోని నరసింహస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పండుగ, స్వామివారి జన్మదిన నక్షత్రం స్వాతి నక్షత్రం కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. – సాక్షిబృందం:

అన్నదాతకు అండ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తామెప్పుడూ రైతు పక్షమేనని మరోసారి నిరూపించింది. భారీ వర్షాలకు పంటలు కోల్పోయిన రైతులకు ఇన్సూరెన్స్ మంజూరు చేసి అండగా నిలిచింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ.157.359 కోట్లను మంజూరు చేశారు.



ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగపంట

- జిల్లాకు రూ.157.359 కోట్ల ఇన్సూరెన్స్
- ఆర్‌బీకేల్లో రైతుల జాబితా ప్రదర్శన
- జూలై 5 వరకు అభ్యంతరాల నమోదు

పుట్టపర్తి అర్బన్: పంట నష్టం జరిగిన సీజన్‌లోనే పంట నష్ట పరిహారం అందజేస్తామన్న మాటను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి నిలబెట్టుకున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలు సాగు చేయగా అక్కడక్కడా కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బ తిన్నాయి. అలాగే పంట దిగుబడిపై ప్రభావం చూపడంతో జిల్లా వ్యవసాయాధికారులు వెంటనే అంచనాలు రూపొందించి నష్టం అంచనాలను ప్రభుత్వానికి నివేదించారు. 2022 ఖరీఫ్‌లో జిల్లాలో ఆగస్టు, అక్టోబర్ నెలల్లో కొంత మేర వర్షం తగ్గడంతో పాటు జూలై, సెప్టెంబర్ ,నవంబర్ నెలల్లో అధిక వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. సాధారణ వర్షపాతం కన్నా అధికంగా వర్షాలు కురిసినా ప్రభుత్వం జిల్లా రైతులను దృష్టిలో ఉంచుకొని వాతావరణ బీమాతో పాటు దిగుబడి అంచనాల ప్రకారం కొన్ని పంటలను ఇన్సూరెన్స్‌ను వర్తింపజేసింది.

వాతావరణ బీమా కింద...

జిల్లాలో వాతావరణ బీమా కింద టమాట పంటకు 15 మండలాల్లో 8,349 మంది రైతులకు రూ.59,72,695 మంజూరైంది. చీనీ, బత్తాయి తోటలకు సంబంధించి 27 మండలాలకు చెందిన 9,387 మంది రైతులకు రూ.34,88,09,671 మంజూరైంది. అలాగే వేరుశనగ పంటకు సంబంధించి 14 మండలాలకు చెందిన 88,633 మంది రైతులకు రూ.52,69,84,100 కలిపి మొత్తంగా రూ.88,17,66,466 మంజూరు చేసింది.

దిగుబడి ఆధారంగా...

దిగుబడి ఆధారంగా మొక్కజొన్నకు 27 మండలాల్లోని రైతులకు రూ.15,08,76,691 , కందికి సంబంధించి 27 మండలాల రైతులకు రూ.50,39,63,235 , రాగి పంటకు 32 మండలాలకు రూ.3,69,89,942 మొత్తం కలిపి రూ.69,18,29,868 మంజూరైనట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు. వాతావరణ బీమా, దిగుబడి ఆధారంగా ఇన్సూరెన్స్ రెండూ కలిపి రూ.157,35,96,334 మంజూరైందని వెల్లడించారు.

అభ్యంతరాల నమోదుకు అవకాశం..

జిల్లాలో 416 రైతు భరోసా కేంద్రాలు ఉండగా ఇప్పటికే ఆయా గ్రామాల రైతులకు వచ్చిన ఇన్సూరెన్స్, వాతావరణ బీమా వివరాలను నోటీసు బోర్డుల్లో ప్రదర్శనకు ఉంచారు. అక్కడికి వెళ్లి రైతులు వివరాలను తెలుసుకోవచ్చు. ఇంకా ఎవరికైనా పరిహారం రాకుంటే అభ్యంతరాల నమోదుకు జూలై 5వ తేదీ వరకు అవకాశం కల్పించారు. సంబంధిత ఆర్‌బీకేలో ఆన్‌లైన్‌లో అభ్యంతరాలను తెలియజేయవచ్చు.

పోలీసుల పేరుతో వసూళ్లు

- ఇద్దరి అరెస్టు, రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం

లేపాక్షి: మండలంలోని వడ్డిపల్లి, కొండూరు పరిసర ప్రాంతాల్లో పోలీసుల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ వివరాల మేరకు... హిందూపురం పట్టణంలోని శ్రీకంఠపురంకు చెందిన చరణ్, జ్యోతిష్ గతంలో హిందూపురం సెబ్ సీఐ వద్ద డ్రైవర్‌గా, ఇతర పనులు చేసేవారన్నారు. సెబ్ అధికారులు తనిఖీలు నిర్వహించిన సమయంలో వారితో పాటు ఉండేవారన్నారు. అయితే ప్రస్తుతం వారిద్దరు ఎలాంటి పని చేయడం లేదని చెప్పారు. సులభంగా డబ్బులు సంపాదించాలన్న దురాలోచనతో ఈనెల 27న మండలంలోని వడ్డిపల్లికి వెళ్లి తాము స్పెషల్ ఎక్సైజ్ పోలీసులమని చెప్పి ఆ గ్రామానికి చెందిన వడ్డి జయకీర్తి అనే వ్యక్తి ఇంట్లో సోదాలు చేశారన్నారు. ఆయన ఇంట్లో నాలుగు మద్యం ప్యాకెట్లు దొరికాయన్నారు. అతని వద్ద డబ్బులు డిమాండ్ చేయగా లేవని చెప్పడంతో జయకీర్తి బంధువుల ద్వారా రూ.6 వేలు ఫోన్ పే ద్వారా దండుకున్నారన్నారు. వెళ్లిపోతూ వారింటిపక్కనే ఉన్న మరో మహిళ వద్ద నుంచి రూ. 3 వేలు లాక్కెళ్లారని చెప్పారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. హిందూపురం డీఎస్పీ పర్యవేక్షణలో కొన్ని గంటల్లోనే చరణ్, జ్యోతిష్‌లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామన్నారు. వారిని కోర్టులో హాజరు పరిచామని ఎస్‌ఐ తెలిపారు.

రైతులు రూపాయి కట్టనవసరం లేదు

- విద్యుత్ బిల్లులు నేరుగా రైతుల ఖాతాల్లోకే..
- నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం
- ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భూపతి





హిందూపురం అర్బన్: రైతులు రూపాయి కూడా విద్యుత్ బిల్లుల రూపంలో చెల్లించాల్సిన అవసరం లేదని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్) డి. భూపతి తెలిపారు. 'సాక్షి'తో ఆయన గురువారం ప్రత్యేకంగా మాట్లాడారు. రైతుల్లో విద్యుత్ మీటర్ల ఏర్పాటు, బిల్లుల చెల్లింపులపై కొంత అపోహ ఉన్నదన్నారు. హిందూపురం డివిజన్ వ్యాప్తంగా 37,400 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు.

రూపాయి కట్టకుండా విద్యుత్..

రైతులు వినియోగించే విద్యుత్‌కు బిల్లులు వస్తాయని, అయితే రైతులు ఒక్క రూపాయి కూడా కట్టనవసరం లేదని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భూపతి స్పష్టం చేశారు. ఆ మొత్తాన్ని రైతుల బ్యాంకుల ఖాతాలకే నేరుగా ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. అది తిరిగి రైతుల ద్వారా విద్యుత్ సంస్థకు చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు వద్ద నుంచి వారి విద్యుత్ సర్వీస్ నంబర్, బ్యాంక్ ఖాతాలను ఇప్పటికే సేకరించినట్లు వివరించారు. ఇంకా కొంత మంది రైతులు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు ఎలాగైనా ఉచిత విద్యుత్ పొందుతున్నారో ఇక మీదట కూడా అలానే పొందవచ్చని వెల్లడించారు. నాణ్యమైన విద్యుత్ అందించేందుకే ఇప్పటికే ప్రతి రెండు, మూడు మోటార్లకు ఒక మినీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం పూర్తయినట్లు పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకొన్న 30 రోజుల్లోనే ...

హిందూపురం డివిజన్‌లోని 12 మండలాల్లోని రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లోనే కనెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టామన్నారు. దీనికి అనుగుణంగానే సౌర విద్యుత్ సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు.

మళ్లీ అధిష్టానం వద్దకే పంచాయితీ !

- మడకశిర టీడీపీలో ముదిరిన మునలం
- తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమైన మాజీ ఎమ్మెల్యే ఈరన్న
- నేడోరేపో చంద్రబాబుతో భేటీ



ఈరన్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర: మడకశిర టీడీపీలో మునలం పుట్టింది. ఎన్నోరోజులుగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్న విషయం అందరికీ తెలిసిందే. అయితే తాజాగా టీడీపీ అధినేత చంద్రబాబుతో తాడోపేడో తేల్చుకోవడానికి మాజీ ఎమ్మెల్యే ఈరన్న సిద్ధమవుతున్నారు. రేపో మాపో ఆయన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుతో భేటీ కానున్నట్లు సమాచారం. కష్టకాలంలో పార్టీని నడిపిన తనకు జరుగుతున్న అన్యాయాన్ని అధినేతకు వివరించడానికి ఈరన్న రెడీ అయినట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో తన పట్ల పార్టీ హైకమాండ్ వ్యవహరించిన తీరుపై కూడా ఈరన్న తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు సమాచారం. చంద్రబాబుతో జరిగే భేటీ సానుకూల వాతావరణంలో జరిగితేనే ఆయన పార్టీలో కొనసాగుతారని, లేకపోతే వేరే దారి చూసుకుంటారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

ఈరన్నకు అవమానాల పరంపర..

టీడీపీలో మాజీ ఎమ్మెల్యే ఈరన్నకు అవమానాల పరంపర కొనసాగుతూనే ఉంది. టీడీపీ తరుపున మూడు సార్లు ఎమ్మెల్యేగా ఆయన పోటీ చేశారు. రెండుసార్లు ఓడిపోయారు. ఒకసారి గెలిచారు. అయినా కూడా ఇన్‌చార్జ్‌గా కొనసాగుతూ పార్టీని నడిపారు. అయితే ఈరన్న కష్టాన్ని హైకమాండ్ గుర్తించకుండా ఇన్‌చార్జ్ పదవి నుంచి అవమానకరంగా తప్పించడంపై ఆ పార్టీ కార్యకర్తల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. అదే విధంగా జిల్లాలో బస్సుయాత్ర కమిటీలో ఈరన్నకు హైకమాండ్ చోటు కల్పించింది. అయితే ఇందుకు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అభ్యంతరం వ్యక్తం చేయడంతో మడకశిరలో బస్సుయాత్రను ఏకంగా రద్దు చేశారు. ఇటీవల ఏర్పాటు చేసిన టీడీపీ మండల కమిటీల్లో ఈరన్న వర్గానికి చోటు కల్పించకుండా తీవ్రంగా అవమానించారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఈరన్న వర్గీయుల్లో హైకమాండ్ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది.

టీడీపీలో దళితులకు దక్కని గౌరవం..

టీడీపీలో దళితులకు గౌరవం లేదనడానికి మడకశిర పరిణామాలే నిదర్శనమని తెలుగు తమ్ముళ్లే చెబుతున్నారు. ఎస్సీ నియోజకవర్గమైన మడకశిరకు టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న దళిత వర్గానికి చెందిన ఈరన్నను తప్పించి టీడీపీ హైకమాండ్ అవమానించింది. అదే విధంగా ఈరన్న నాయకత్వంలో బస్సుయాత్ర చేయకుండా హైకమాండ్ ఆపేసింది. ఎస్సీ వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యేకే పార్టీలో గౌరవం లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

దబ్బున్న వారికే చంద్రబాబు ప్రాధాన్యత..

చంద్రబాబు డబ్బున్న వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని టీడీపీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి 2014లో టీడీపీలో చేరారు. ఆర్థికంగా బలంగా ఉండడంతో పార్టీ ఇన్‌చార్జ్ పదవిని కట్ట బెట్టారు. పలుసార్లు ఎన్నికల్లో పోటీ చేసి ఆర్థికంగా నష్టపోయిన ఈరన్నకు హైకమాండ్ అన్యాయం చేసిందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈరన్నకు ఆర్థికబలం లేకపోవడంతో పార్టీ హైకమాండ్ కేవలం అవసరానికి వాడుకొని పక్కన పెట్టిందంటున్నారు. టీడీపీ హై కమాండ్ ఈ వ్యవహారాన్ని ఎలా పరిష్కరిస్తుందో చూడాలి.

బస్సు యాత్ర కాదది.. తుస్సు యాత్ర

- 'జగనన్న సురక్ష 'ను విజయవంతం చేయాలి
- ఎమ్మెల్యే శంకరనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: జిల్లాలో తెలుగుదేశం పార్టీ చేపట్టిన భవిష్యత్‌కు గ్యారెంటీ యాత్ర... తుస్సు యాత్రగా మారిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ విమర్శించారు. గురువారం ఆయన పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ జూలై 1 నుంచి 30 వరకు నిర్వహించనున్న 'జగనన్న సురక్ష ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా అర్హులందరికీ ఇళ్ల వద్దకే సంక్షేమ ఫలాలను అందిస్తున్నారన్నారు. అయితే సాంకేతిక కారణాల వల్ల అర్హత ఉండి పథకాలకు దూరమైన వారికి లబ్ధి చేకూర్చడమే 'జగనన్న సురక్ష ' కార్యక్రమం ఉద్దేశమన్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ఇతర అధికారులందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నట్లు పేర్కొన్నారు. జూలై ఒకటి నుంచి ప్రజలకు కుల, మరణ, జనన, హౌస్ హోల్డ్ మ్యాపింగ్, హౌస్‌హోల్డ్ అనుమతులు, రేషన్ కార్డులు తదితర ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. దేశ చరిత్రలో ఏ ప్రభుత్వమూ ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టలేదని, కేవలం వైఎస్ జగన్‌కే ఇది సాధ్యమైందన్నారు.

చంద్రబాబును నమ్మొద్దు..

గతంలో 600 హామీలు ఇచ్చి ప్రజలను ముప్పుతిప్పలు పెట్టిన వ్యక్తి టీడీపీ అధినేత చంద్రబాబు అని ఎమ్మెల్యే శంకరనారాయణ విమర్శించారు. రుణాలు మాఫీ చేస్తానని రైతులు, డ్వాక్రా మహిళలను మోసం చేసిన విషయాన్ని ఇంకా ఎవరూ మర్చిపోలేదన్నారు. చంద్రబాబు తప్పుడు హామీలను ప్రజలు నమ్మి ఓటేస్తే దగా చేయడం ఖాయమన్నారు. తెలుగు దేశం పార్టీ నాయకులు జిల్లాలో చేపట్టిన భవిష్యత్‌కు గ్యారెంటీ యాత్ర .. తుస్సు యాత్రగా మారిందన్నారు. జిల్లా నాయకులకే దీనిపై క్లారిటీ లేదన్నారు. అభద్రతా భావంలో టీడీపీ నాయకులు కొట్టు మిట్టాడుతున్నారని చెప్పారు. పెనుకొండలో సవితమ్మ, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి వర్గీయులు కొట్టుకుంటూ ఆ పార్టీని బజారు పాలు చేశారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు శ్రీరాములు, ఎంపీపీ గీతా రామ్మోహన్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహ, నాగలూరు బాబు పాల్గొన్నారు.

వైభవంగా రుక్మిణీ పాండురంగని రథోత్సవం





అలంకరణలో మూలవిరాట్ లక్ష్మీపాండురంగస్వామి, భక్తజనసమూహం నడుమ సాగుతున్న రథోత్సవం

హిందూపురం: ముద్దిరెడ్డిపల్లిలో ఆషాఢ తొలి ఏకదశిని పురస్కరించుకొని రుక్మిణీ పాండురంగ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం వైభవంగా జరిగింది. రుక్మిణీ పాండురంగస్వామికి మడుగుతేరు, మండల పూజ, అగ్నిప్రతిష్టాపన, దీక్షాహోమం, గణపతి, నవగ్రహ, మృతుంజయ హోమంతో పాటు రుక్మిణీ పాండురంగస్వామి హోమాలు నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం రథం ఎదుట రథాంగహోమం, అష్టదిక్షబలిప్రదానం పూజలు చేశారు. మేళతాళాలతో లక్ష్మీసమేత పాండురంగ స్వామి ఉత్సవమూర్తులను ప్రాకారోత్సవం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కమిషనర్ ప్రమోద్‌కుమార్, కౌన్సిలర్ జయప్ప రథోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పల్లా లక్ష్మీకుమార్, చింతాగోపాల్, మంజునాథ్, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి



మృతి చెందిన గొర్రె పిల్లలను పరిశీలిస్తున్న డాక్టర్ స్వర్ణలత

తాడిమర్రి: వీధి కుక్కల దాడిలో 30 గొర్రె పిల్లలు మృతి చెందిన ఘటన తాడిమర్రిలో చోటు చేసుకుంది. స్థానిక బీసీ కాలనీకి చెందిన గంగాధర్ గురువారం ఉదయం 30 గొర్రె పిల్లలను దొడ్డిలోని పాదిలో ఉంచి తన గొర్రెల మందను మేపునకు తోలుకెళ్లాడు. ఉదయం 11 గంటలకు వీధి కుక్కలు పాదిలిని పక్కకు నెట్టి గొర్రె పిల్లలపై దాడి చేశాయి. ఘటనలో 30 గొర్రె పిల్లలూ మృతి చెందాయి. సమాచారం అందుకున్న పశువైద్యాధికారి డాక్టర్ స్వర్ణలత అక్కడకు చేరుకుని పరిశీలించారు.

చిరుత దాడిలో మేక మృతి

రొళ్ల: చిరుత దాడిలో ఓ మేక పోతు మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... రొళ్ల మండలం టీడీపల్లికి చెందిన గోవిందరాజు మేకల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం భోజనం చేసిన తర్వాత మందను మేత కోసం గ్రామ పొలిమేర వద్దకు తోలుకెళ్లాడు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న చిరుత ఒక్కసారిగా మందపైకి దాడి చేసి, మేక పోతును నోట కరుచుకుని వెళ్లిపోయింది. విషయాన్ని గమనించిన కాపరి కేకలు వేస్తూ వెంటపడడంతో మేకపోతును వదిలి అటవీ ప్రాంతంలోకి చిరుత పరుగు తీసింది. అప్పటికే మేక పోతు మృతి చెందింది. ఘటనతో రూ.8వేలు నష్టపోయినట్లు బాధిత కాపరి వాపోయాడు.

గుంతలో పడిన ఎద్దు



రాయదుర్గంటౌన్: పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డు సీతమ్మ మిల్లు సమీపంలో నిర్మాణ దశలో ఉన్న ఇంటి వద్ద భారీస్థాయిలో తీసిన నీటి సంపు(గుంత)లో పడిన ఎద్దును గో సంరక్షక దళ సభ్యులు సురక్షితంగా బయటకు తీశారు. ఉదయం రెండు ఎద్దులు పోట్లాడుకుంటూ. ఒక ఎద్దు సంపులో పడినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న గోసంరక్షక దళ సభ్యులు క్రేన్ సహాయంతో ఎద్దును సురక్షితంగా బయటకు తీసి సేవా నిరతిని చాటుకున్నారు.

ఉచితంగా 11 రకాల సేవలు

- అవసరమైన ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి
- లేకపోతే సేవలు పొందలేరు

ప్రయోజనం

అనంతపురం అర్బన్/పుట్టపర్తి అర్బన్: 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజలకు 11 రకాల సేవలను ఉచితంగా అందించే బృహత్తర కార్యక్రమానికి జగన్ సర్కార్ శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం నెల రోజుల పాటు కొనసాగనుంది. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 1వ తేదీ వరకూ అధికారులు సచివాలయ పరిధిలో క్యాంపులు నిర్వహించి ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను జారీ చేస్తారు. ఈ క్రమంలో ఈ నెల 30వ తేదీ వరకు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించి ప్రజలతో మాట్లాడి వారికి అవసరమైన సేవలకు సంబంధించిన అభ్యర్థనను రిజిస్టర్ చేస్తారు. క్యాంపు నిర్వహించే రోజున సరైన ధ్రువీకరణ పత్రాలతో హాజరయ్యేలా చైతన్య పరుస్తున్నారు. క్యాంపులోనూ సమస్యలపై అభ్యర్థనలు, ఫిర్యాదులు స్వీకరిస్తారు.

సేవలకు అందజేయాల్సిన డాక్యుమెంట్లు...

- **కుల ధ్రువీకరణ పత్రం:** ఆధార్ కార్డు జిరాక్స్, బియ్యం కార్డు జిరాక్స్, 10వ తరగతి టీసీ, గతంలో జారీ చేసిన కులధ్రువీకరణ పత్రం, ఇంతకుముందే ఇంటి పేరుతో జారీ చేసిన కుటుంబ సభ్యుల కుల ధ్రువీకరణ పత్రం.
- **ఆదాయ ధ్రువీకరణ పత్రం:** ఆధార్‌కార్డు జిరాక్స్, బియ్యం కార్డు జిరాక్స్
- **జనన ధ్రువీకరణ పత్రం:** జనన ధ్రువీకరణ ఆధారం, అఫిడవిటి, నాన్ అవైలబుల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్
- **మరణ ధ్రువీకరణ పత్రం:** దరఖాస్తు, మరణ ధ్రువీకరణ ఆధారం, అవిడవిటి, నాన్ అవైలబుల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, బియ్యం కార్డు జిరాక్స్
- **మ్యుటేషన్, టైటిల్ డీడ్, పట్టాదారు పాసు పుస్తకం:** దరఖాస్తు, రిజిస్టర్ డాక్యుమెంట్లు, పాత పట్టాదారు పాసు పుస్తకం/ టైటిల్ డీడ్ (సెల్లర్ పీపీబి/టీడీ), పన్ను రసీదులు, కొత్తగా తీయించుకున్న పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, సంతకం
- **వివాహ ధ్రువీకరణ పత్రం:** దరఖాస్తు, పెళ్లి ఫొటో, శుభలేఖ, పెళ్లి కుమార్తె, పెళ్లి కుమారుడి ఆధార్ కార్డు జిరాక్స్, నివాస ధ్రువీకరణ పత్రం (రేషన్ కార్డు, ఆధార్ కార్డు, విద్యుత్ బిల్, ఓటరు గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్, జాబ్‌కార్డు)
- **ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్:** దరఖాస్తు, మరణించిన వ్యక్తితో సంబంధం ఉన్న వారి పేరు, వయసుతో నోటరీ చేసిన అఫిడవిటి, ధ్రువీకరణకు బియ్యం కార్డు, నోటరీ ఐడీ, పాస్‌పోర్ట్, పాసుపుస్తకం, ఆధార్ కార్డు మణించిన వారితో దరఖాస్తుదారుకు ఉన్న సంబంధాన్ని సూచిస్తుంది.
- **ఆధార్‌కు మొబైల్ నెంబర్ అనుసంధానం:** మీ-సేవ దరఖాస్తు ఫారము, ఆధార్ కార్డు జిరాక్స్
- **కౌలు రైతుకు సీసీఆర్‌సీ కార్డు:** దరఖాస్తు, ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదారు పాసుపుస్తకం/ పాస్ పోర్టు సైజు ఫొటో, భూ యజమాని అంగీకార పత్రం.
- **కొత్త బియ్యం కార్డు, విభజన కార్డు:** దరఖాస్తు ఫారము, ఆధార్ కార్డులు, పాత బియ్యం కార్డు, కొత్తకార్డు కోసం హౌస్ హోల్ మ్యాపింగ్
- **హౌస్ హోల్డ్ విభజన:** దరఖాస్తు, ఆధార్ కార్డులు, వివాహ ధ్రువపత్రం/ బియ్యం కార్డు/ ఆరోగ్య శ్రీకార్డు, తదితరమైనవి.



సోమందేపల్లి మండలం వెలుగుమాకులపల్లిలో 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు సూచనలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు (ఫైల్)

డాక్యుమెంట్లు తప్పనిసరి



జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సేవలు ఉచితంగా అందించే కార్యక్రమం జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు కొనసాగుతుంది. ప్రజల అభ్యర్థనకు సంబంధించి ధ్రువపత్రాలను సచివాలయ పరిధిలో నిర్వహించే క్యాంపులో జారీ చేస్తారు. సేవలు అందుకోవాలంటే నిర్దేశించిన డాక్యుమెంట్లను అర్జీదారు తప్పనిసరిగా సమర్పించాలి.

– అరుణ్‌బాబు, కలెక్టర్

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

నల్లచెరువు: తొలి ఏకాదశిని పురస్కరించుకుని నల్లచెరువు మండలం గోరంట్లవారిపల్లిలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. గ్రామం నలువైపులా వీధి దీపాలతో అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై కొలువుదీర్చి గ్రామంలో ఊరేగించారు. భక్తులకు గ్రామపెద్ద రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

కర్ణాటక మద్యం పట్టివేత



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రొద్దం: మండలంలోని శ్యాపురం గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. అందిన ముందస్తు సమాచారంతో ఎస్‌ఐ నాగస్వామి, సిబ్బంది శ్యాపురం వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై కర్ణాటక మద్యం తరలిస్తూ చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దెలకు చెందిన నాగార్జున పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి 768 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. విచారణలో అప్పాజిపల్లి వద్ద ఆర్‌ఆర్‌ఆర్ బార్ అండ్ రెస్టారెంట్‌కు కర్ణాటక మద్యం సరఫరా చేస్తున్నట్లు అంగీకరించడంతో రెస్టారెంట్ యజమానిపై సైతం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వివరించారు.

వివాహిత ఆత్మహత్య



మృతురాలు సాకియా

హిందూపురం అర్బన్: స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముక్కిడిపేటలో నివాసముంటున్న వివాహిత సాకియా(20) ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో విసుగు చెందిన ఆమె గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యుల సమాచారంతో వన్‌టౌన్ సీఐ ఈరన్న అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వివాహిత బలవన్మరణం

కళ్యాణదుర్గం: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామానికి చెందిన గొల్ల నాగేంద్ర, లక్ష్మీదేవి (40) దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగించేవారు. గురువారం ఉదయం కూలి పనులకు వెళ్లి వచ్చిన భర్త చిన్న పాటి విషయంగా లక్ష్మీదేవిని మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె వ్యవసాయ తోటలో చెట్టుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గమనించి సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడుకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తేజమూర్తి తెలిపారు.

అండర్-19 క్రికెట్ టోర్నీ ప్రారంభం





68 పరుగులు చేసిన వెంకటలోకేష్, వీరారెడ్డి

కడప స్పోర్ట్స్: వైఎస్సార్ జిల్లా కడపలోని వైఎస్ రాజారెడ్డి- ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా గురువారం ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. తొలిమ్యాచ్‌లో కడప, కర్నూలు జట్లు తలపడగా 4 వికెట్ల తేడాతో కడప జట్టు విజయం సాధించింది. అలాగే కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 308 పరుగులు చేసింది. జట్టులోని వీరారెడ్డి, వెంకటలోకేష్ చెరో 68 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్ వెంకయ్య 4 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు బ్యాట్స్‌మన్ 38.5 ఓవర్లలో 192 పరుగులకే ఆలౌట్ అయ్యారు. జట్టులోని మన్విత్ 95 బంతుల్లో 8ఫోర్లు, 6 సిక్సర్‌లతో 101 పరుగులు చేశారు. అనంత బౌలర్లు ప్రదీప్ 4, తన్వీర్ 3 వికెట్లు తీశారు. దీంతో అనంతపురం జట్టు 116 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

దీర్ఘకాలిక నొప్పి మాయం!

'ఇట్స్‌గాన్.. పోయ్‌పాచే.. పోయిందే'.. అమృతాంజన్‌కు సంబంధించిన పాత యాడ్ గుర్తుందా? ఇలా రాయగానే.. అలా నొప్పి మాయమవుతుందనే రీతిలో రూపొందించిన యాడ్ అప్పట్లో అందరినీ ఆకట్టుకుంది. యాడ్ విషయం ఏమో గానీ ఇలా చికిత్స చేయగానే దీర్ఘకాలిక నొప్పులన్నీ అలా మటుమాయమైతే ఎలా ఉంటుంది? అద్భుతంగా ఉంటుంది కదూ. అయితే ఇది సాధ్యమేనని నిరూపించారు అనంతపురం సర్వజనాస్పత్రిలోని అనస్తీషియా వైద్యులు. ఎలాంటి శస్త్రచికిత్స.. కుట్లు లేకుండా అందజేస్తున్న అరుదైన చికిత్సకు అనతి కాలంలోనే అనూహ్య స్పందన లభించింది.

- కోత లేదు... కుట్టూ లేదు
- దీర్ఘకాలిక నొప్పులతో బాధపడేవారికి ఉత్తమ సేవలు
- సర్వజనాస్పత్రిలోని పాలియేటివ్ కేర్‌కు అనూహ్య స్పందన



దీర్ఘకాలిక మోకాలి నొప్పితో బాధపడుతున్న రోగికి చికిత్స చేస్తున్న డాక్టర్ నవీన్ బృందం

అనంతపురం క్రైం: దీర్ఘకాలిక నొప్పులతో బాధపడే వారికి ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని అనస్తీషియా వైద్యుల ఆధ్వర్యంలో పాలియేటివ్ కేర్ (ఓపీ నెం. 39) యూనిట్ ఏర్పాటు చేశారు. ఈ యూనిట్‌ను ఈ ఏడాది మే 5న ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజని లాంఛనంగా ప్రారంభించినప్పటి నుంచి రోజూ ఓపీ సేవలు అందజేస్తున్నారు. కేసు తీవ్రతను బట్టి చికిత్సను అందిస్తున్నారు. ఇప్పటి వరకూ దీర్ఘకాలిక నొప్పులతో బాధపడుతున్న 581 మంది చికిత్స అందుకోగా, వీరిలో 533 మంది మోకాళ్ల నొప్పులతో బాధపడేవారు, 36 మంది వెన్నుపూస నొప్పితో బాధపడేవారు, 12 మంది మెడ వద్ద నొప్పితో బాధపడే వారు ఉన్నారు.

ఇతర జిల్లాల నుంచి తరలి వస్తున్న రోగులు

పాలియేటివ్ కేర్ యూనిట్‌లో సేవలు అందుకుని కోలుకున్న రోగులు తమ అనుభవాలను స్నేహితులు, బంధువులకు పంచడంతో సర్వజనాస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య క్రమేణ పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం చికిత్స కోసం 818 మంది వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు. వీరిలో ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు నెల్లూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు చెందిన వారుండడం గమనార్హం. దీర్ఘకాలిక నొప్పులతో బాధపడుతూ చికిత్సకు వచ్చే వారి సంఖ్య వందల్లో పెరగడంతో చికిత్స కోసం రోగులు నెలలు తరబడి వేచి చూసే పరిస్థితి నెలకొంది. అయితే అత్యవసర సేవల కింద నడవలేని స్థితిలో ఉన్న వారికి సత్వరమే చికిత్స అందజేస్తున్నారు.

సమష్టి కృషితోనే సేవలు



ఆపరేషన్ థియేటర్‌లోని స్వీపర్ మొదలు అనస్తీషియా టెక్నీషియన్, స్టాఫ్‌నర్సులు, వైద్యుల వరకూ అందరి సమష్టి కృషితోనే ఈ విజయం సాధ్యమైంది. ఇతర జిల్లాల నుంచి కూడా దీర్ఘకాలిక నొప్పులతో బాధపడే వారు చికిత్స కోసం వస్తున్నారు. అత్యవసర కేసులకు వచ్చిన రోజే వైద్య పరీక్షలు చేయించి సేవలందిస్తున్నాం. సాధారణ కేసులను తేదీల ప్రకారం సేవలందించేలా చర్యలు తీసుకున్నాం. పైసా ఖర్చు లేకుండా ఉచితంగా అందిస్తున్న సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ నవీన్, హెచ్‌ఓడీ, అనస్తీషియా విభాగం

సంపులో పడి చిన్నారి మృతి



జస్వంత్ (ఫైల్)

రాయదుర్గం: ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ఓ చిన్నారి మృతి చెందాడు. కాగా, మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వివరాలు.. రాయదుర్గంలోని చంద్రబాబు కాలనీకి చెందిన సరిత అలియాస్ సిరాజ్, మంజునాథ దంపతులకు జస్వంత్ అనే మూడేళ్ల చిన్నారి ఉన్నాడు. బుధవారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారి కాసేపటికి కనిపించకుండా పోయాడు. చుట్టుపక్కల ప్రాంతాల్లో కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు సైతం రంగంలో దిగి గాలింపు చేపట్టారు. ఆచూకీ చిక్కలేదు. గురువారం ఉదయం వీరు నివాసముంటున్న ఇంటి సమీపంలో నిర్మాణం చేపట్టిన ఇంటి లోపల నీటి సంప్‌లో చిన్నారి మృతదేహం బయటపడింది. ఒక్కగానొక్క కొడుకు మృతిచెందాడనే వార్త తెలియగానే తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. కాగా, చిన్నారి మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. నిర్మాణం చేపట్టిన ఇంటి లోపలి భాగాన సంప్ తవ్వారని, అక్కడికి చిన్నారి ఎలా వెళ్లాడో అర్థం కావడం లేదంటున్నారు.ఆడుకుంటూ వెళ్లి అందులో పడినా చిన్నపాటి గాయం కూడా లేకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ లక్ష్మన్న తెలిపారు.

కనుల పండువగా 'తొలి ఏకాదశి'

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో ఆషాడ శుద్ధ ఏకాదశి (తొలి ఏకాదశి) పర్వదిన వేడుకలు గురువారం కనుల పండువగా సాగాయి. గోవా, మహారాష్ట్ర నుంచి తరలివచ్చిన భక్తుల వేదపఠనంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పాండురంగడు, రుక్మిణి మాత విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఊరేగింపుగా సత్యసాయి మహాసమాధి చెంతకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్యసాయిని వితలేశ్వరుడిగా కొనియాడుతూ సాగిన నృత్య రూపకం ఆకట్టుకుంది. పడమటి మహారాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు ధర్మేష్ వైద్య మాట్లాడుతూ.. సాయి, పాండురంగ వితలుడి మధ్య సారూపత్యను, దిండి (యాత్ర) ప్రాముఖ్యతను వివరించారు. సాయంత్రం జరిగిన వేడుకల్లో పడమటి మహారాష్ట్ర -1 సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు శ్రీనివాస్ రాఘవన్ మాట్లాడుతూ ఆషాఢ ఏకాదశి వేడుక విశిష్టతను తెలిపారు. అనంతరం లఘు నాటికతో బాలవికాస్ విద్యార్థులు ఆకట్టుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి



వితల్ బార్వా పేరుతో మహారాష్ట్ర భక్తులు ఇస్తున్న నృత్య ప్రదర్శన



లఘు నాటికను ప్రదర్శిస్తున్న బాల వికాస్ విద్యార్థులు



ఊరేగింపుగా సత్యసాయి మహాసమాధి చెంతకు వస్తున్న భక్తులు

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

నవోదయ కోచింగ్

■ 1st జూలై నుండి కొత్త బ్యాచ్ ప్రారంభం. బాల బాలికలకు హాస్టల్ వసతి కలదు. రూరల్ SC,ST విద్యార్థులకు ప్రత్యేక రాయితీ కలదు. అనంతపురం. సెల్ : 9182837914. [A-776754]

B.Tech / B.Pharm

■ AP EAPCET లో క్వాలిఫై అయితే ఫ్రీ ఎడ్యుకేషన్, క్వాలిఫై కాకపోతే ఓన్లీ హాస్టల్ ఫీజుతో B.Tech, B-ఫార్మసీ చదివే అవకాశం. సంప్ర : జి. మురళీ, 9030661651, ATP. [A-917]

PARAMEDICAL

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1450]

ఉచిత శిక్షణ ఉపాధి

■ గ్రామీణ నిరుద్యోగ యువతకు 4 నెలల కాల వ్యవధిలో కంప్యూటర్ హార్డ్వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సులలో ఉచిత శిక్షణ, భోజన వసతి సదుపాయం, అర్హతను బట్టి ఉపాధి అవకాశాలు కల్పించబడును. Nihar skill Education,కడప. సంప్ర: 9063082227. [C-785822]

REAL ESTATE

TOLET

■ అనంతపురం, రుద్రంపేటలో బెస్ట్‌కేర్ హాస్పిటల్ ఎదురుగా 1 BHK ఇల్లు, నీటి వసతితో అద్దెకు కలదు. సంప్ర. సెల్ : 9900498485. [A-776761]

విల్లాస్ - బాడుగకు

■ TOLET : ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించబడిన ప్రముఖ రేణుక గేటెడ్ కమ్యూనిటీ నందు అన్ని వసతులతో, కొన్ని విల్లాస్‌లు ఖాళీగా ఉన్నవి. సంప్ర : 9000856501, ATP. [A-927]

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2404]

WATER PROOFING

■ SSB వాటర్ ప్రూఫింగ్: స్లాబ్, బాత్రూమ్స్, సైడ్ వాల్స్, బాల్కనీ, ట్యాంక్, టెర్రస్ లీకేజీలు 20 సం॥ల అనుభవంతో కెమికల్స్ ద్వారా 10 సం॥ గ్యారెంటీతో చేయబడును. ఫోన్: 7337067834 [H-788911]

వధువు కావలెను

■ రెడ్డి / 28 సం॥ / B.Tech./ పొలం + లారీ ట్రాన్స్ పోర్ట్ గల కడప అబ్బాయికి తగిన, అందమైన, మంచి కుటుంబానికి చెందిన రెడ్డి వధువు కావలెను. డైరెక్ట్ : 9676719135. [A-776759]

శ్రీ గాయత్రీదేవి జ్యోతిష్యాలయం

■ ఉచితంగా జ్యోతిష్యం చెప్పబడును. పండిట్ S.V. శాస్త్రి గారు గత 70 సం॥లుగా అనంతపురంలో స్థిరపడి ఉంటున్నారు. స్త్రీ, పురుషులకు ఎటువంటి సమస్యకైనా గాయత్రి దేవి పూజ చేసి 7 రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపబడును. సెల్: 7676703640. [A-7569]

WANTED

■ కనగానపల్లి మండలం, ముక్తాపురం గ్రామం దగ్గర వ్యవసాయం పనులు చేయుటకు తోటమాలి కావలెను. సంప్ర॥ సెల్ : 9701637389, 8328521391. [A-923]

■ హాస్టల్ వార్డెన్లు వంట మనుషులు, హాస్టల్ ట్యూటర్స్, వాచ్‌మెన్, Maths టీచర్లు అర్జెంటుగా కావలెను. సెల్ : 9491986783, అనంతపురం. [A-776753]

■ అనంతపురం నగరంలోని, ప్రముఖ పాలిటెక్నిక్ కాలేజీలో పనిచేయుటకు B.Tech / M.Tech / M.Sc. మ్యాథ్స్ చదివిన, మంచి అనుభవం కల్గిన అధ్యాపకులు కావలెను. సంప్ర : 8886621124, 8886621125, 8886621128. [A-776755]

■ టీచర్స్ కావలెను : 1 నుండి 5వ తరగతి వరకు బోధించుటకు అన్ని సబ్జెక్టులకు టీచర్స్ కావలెను. # రూట్స్ పబ్లిక్ స్కూల్, రాచానపల్లి, GNR వనం, బళ్లారి రోడ్డు, ATP. సెల్ : 9908433610, 9000575759. [A-776756]

■ ఉద్యోగాలు: YMC నూతనంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లో Job చేయుటకు యువతీ యువకులకు అవకాశం కలదు. అ: 10th, ఇంటర్, డిగ్రీ (P/F) Age: 18 to 30. నో ఫీజు. సెల్: 9177342337. [WA-6994]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+భోజనం, జీ: 18K హైదరాబాద్ : 9640258899, విజయవాడ: 9640648899 [HA-337]

■ ప్రముఖ బ్యాంకుల యందు కాంట్రాక్టు/ ఔట్ సోర్స్‌లో వర్క్ చేయడానికి ఫీమేల్ స్టాఫ్ అ॥కా॥ను. జీ: 15k-34k. ఇంట్రెస్ట్ ఉన్నవారు డీటేల్స్ వాట్సాప్ చేయండి. ఫోన్ : 6281159171 [HA-29751]

■ మా యొక్క ప్రముఖ సంస్థకు మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ అధిక ఆదాయం సంపాదించు కోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221323]

■ పామిడి పట్టణంలో ఉన్న యస్.ఆర్. డిగ్రీ కళాశాలలో పనిచేయుటకు అన్ని సబ్జెక్ట్‌లకు సంబంధించిన అధ్యాపకులు వెంటనే కావలెను. సంప్రదించండి సెల్ : 9959803279, 9676292629 [A-776757]

■ విజయవాడ, గాయత్రినగర్‌లోని SVVC మా సంస్థ కొరకు అనంతపురం జిల్లాలో పని చేయుటకు మండలాల వారీగా 50 సం॥ లోపు వయస్సు గల లేడీస్ & జెంట్స్ కావలెను. 93477 79584. [NA-10343]

■ WANTED ENGLISH TEACHER for 6 to 10th English Medium Classes. Contact: VIGNAN EM HIGH SCHOOL, SOMANDEPALLI, Near PENUKONDA, Sri Sathya Sai (Dist). 8309913221, 9347986668 [A-932]

■ Paparao High School, K.Uppalapadu, Prakasam Dist. Wanted Experienced Teachers for High school English, Primary School, Data Entry Op., Office Staff & Clerks. Salary negotiable. Free Food & Accommodation. Call: 7019326579/ 8008622210 - Principal. [HA-03171]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

4 లైన్లు రూ. 270/- అదనపు లైను రూ. 60/-

ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం

ANANTHAPURAMU : 9010567770, 9492288307, 9010588846, 9243295650
DHARMAVARAM : 9912220726, 9912220727
HINDUPUR : 9912220723, 9705346587
GUNTAKAL : 9010223701
TADIPATRI : 9912220722
MADAKASIRA : 9010200238
KADIRI : 9010593486
RAYADURG : 9010470185